7

సాక్షి అనకాపల్లి

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024







అభిమానుల సందడి

విశాఖ.. హ్యాట్రిక్



వికెట్ తీసిన ఆనందంలో బుమ్రా







హిట్ మ్యాన్ పోస్టర్ ప్రదర్శిస్తున్న అభిమాని



ఇంగ్లండ్ అభిమానులు



ఇంగ్లండ్ ఆటగాడు వికెట్ ఇలా ఎగిరింది



రోహిత్ శర్మతో కరచాలనం చేస్తున్న గోపినాథ్

- వైఎస్సార్ స్టేడియంలో వరుసగా మూడు టెస్టు మ్యాచ్‌ల్లో భారత్ విజయం
- 2016లో తొలిసారి ఇంగ్లండ్, 2019లో దక్షిణాఫ్రికా, 2024లో ఇంగ్లండ్‌ని మట్టికరిపించిన భారత్



వికెట్ తీసిన ఆనందంలో..

విశాఖ స్పోర్ట్స్ : అంతర్జాతీయ క్రికెట్ అన్ని ఫార్మాట్లతో పాటు దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లకు ఆతిథ్య మిచ్చిన విశాఖలోని వైఎస్ఆర్ స్టేడియంలో సోమవారం మరో మైలురాయిను అందుకుంది. వైఎస్ఆర్ స్టేడియంలో ఇప్పటికి మూడు టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. మూడింట విజయాలతో అతిథ్య జట్టు హ్యాట్రిక్ నమోదు చేసింది. తొలిసారి ఇంగ్లండ్ జట్టుతోనే 2016లో వైఎస్ఆర్ స్టేడియంలో టెస్ట్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌ల్లో భారత్ 246 పరుగుల తేడాతో విజయం సాధించింది. తర్వాత 2019లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 203 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముచ్చటగా మూడో మ్యాచ్ మళ్లీ ఇంగ్లండ్ జట్టుతోనే ఆడి 106 పరుగుల తేడాతో విజయం సాధించి హ్యాట్రిక్‌ను నమోదు చేసింది. అయితే ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ భారత్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌ను ఎంచుకునే విజయకేతనం ఎగురవేయడం గమనార్హం. ఐదు రోజుల మ్యాచ్ నాలుగు రోజుల్లోనే ముగిసింది. స్టేడియంలో నిర్వహించిన బెస్ట్ అవార్డుల ప్రదానోత్సవం తర్వాత ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మ్యాచ్‌లకు అన్నిహంగులతో వైఎస్ఆర్ స్టేడియం ఉండటంతో మరిన్ని మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చేందుకు బీసీసీఐ సముఖత వ్యక్తం చేసిందన్నారు. విశాఖ పిచ్ పట్ల బీసీసీఐ, ఆతిథ్య జట్టు కెప్టెన్, కోచ్‌లు సైతం సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి మరిన్ని సంస్కరణలు చేపట్టనున్నామన్నారు. ఇదిలా వుండగా మ్యాచ్ తొలి రోజు మూడు వేల మంది విద్యార్థులతో సహా 15వేల మంది వీక్షించగా రెండో రోజు ఐదు వేల మంది విద్యార్థులతో పాటు 14500మంది వీక్షించారు. ఇక ఆదివారం రోజు ఏడువేల మంది విద్యార్థుల్ని అనుమతించగా మొత్తంగా 19 వేల మంది, సోమవారం అనుమతించిన ఏడువేల మంది విద్యార్థులతో పాటు 17వేల మంది మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.



విద్యార్థుల కేరింతలు

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్‌గా గోపినాథ్



విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్‌గా గోపినాథ్ ఎన్నికయ్యారు. సోమవారం నగరంలో జేఏసీ ఆధ్వర్యంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులంతా గోపినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో–చైర్మన్‌గా చొక్కాకుల సూర్యనారాయణ(వైఎస్సార్ టీఎఫ్), సీహెచ్.కె.మూర్తి(ఎస్ఎల్‌టీఏ), ఎన్. వెంకటరెడ్డి(ఎంఏపీఏపీబీసీడబ్ల్యూఆర్ఎస్), మడ్డు శ్రీనివాస్ రావు(పీఆర్‌టీయూ), బీఎస్ఆర్ శర్మ(ఏపీసీఎల్ఏ)లను ఎన్నుకున్నారు.

ఉత్తమ హోంగార్డుగా కృష్ణారావు



హోంగార్డు కృష్ణారావుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

నర్సీపట్నం: నర్సీపట్నం టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు కైసర్ల కృష్ణారావు ఉత్తమ సేవలకు నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ప్రశంసాపత్రం అందజేశారు. విధులను నిబద్ధతతో నిర్వర్తించడంతో పాటు 4 వేలకు పైగా ఎంవీ చలానాలు, 710 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంలో కృష్ణారావు ప్రధాన పాత్ర వహించారు. కృష్ణారావు సేవలను గుర్తిస్తూ ఏఎస్పీ ప్రశంసా పత్రం అందజేసి, మరింత సమర్థవంతంగా పనిచేయాలని ప్రోత్సహించారు. టౌన్ సీఐ కాంతి కుమార్, ఎస్సైలు సుధాకర్, మహేశ్వరరావు పాల్గొన్నారు.

9న అప్పన్న తెప్పోత్సవానికి ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఏసీపీ నరసింహమూర్తి

సింహాచలం: పుష్యబహుళ అమావాస్యని పురస్కరించుకుని ఈనెల 9న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి తెలిపారు. సంబంధిత ఏర్పాట్లపై సోమవారం దేవస్థానం, పోలీస్, జీవీఎంసీ, అడవివరం ఆరోగ్యకేంద్రం, ఎస్‌పీఎఫ్, ఫైర్ శాఖల అధికారులతో దేవస్థానం కార్యాలయంలో ఈవో సమీక్ష నిర్వహించారు. అలాగే తెప్పోత్సవం జరిగే కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆరోజు సాయంత్రం 4.30 నుంచి 5 గంటల మధ్యలో స్వామివారు సింహగిరి నుంచి మెట్లమార్గంలో కొండదిగువ తొలిపావంచా వద్దకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి వరాహ పుష్కరిణి వద్దకు స్వామిని తీసుకెళ్లి సాయంత్రం 5.30 గంటల నుంచి తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 8.15 గంటల నుంచి అడవివం పురవీధిల్లో తిరువీధి ఉంటుందన్నారు. వరాహ పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లు, అదనపు బోట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. వరాహ పుష్కరిణికి భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ, హంసాకృతి తెప్పకి విశేష పూల అలంకరణ, విద్యుద్దీప అలంకరణ చేస్తామన్నారు. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ తెప్పోత్సవం సందర్భంగా పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెకండియర్ పరీక్ష వాయిదా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 7న జరగాల్సిన ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం మొదటి సెమిస్టర్ బీటెక్, బీఈ, బీఆర్క్ పరీక్షను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 19న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

22 నుంచి ఐద్వా జాతీయ సమావేశాలు

డాబాగార్డెన్స్ (విశాఖ) : విశాఖలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్టు ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 22న నగరంలో ప్రదర్శనతో పాటు బహిరంగ సభ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 26న రాష్ట్ర కార్యవర్గ సమావేశం కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు.

పసలేని మూస ప్రసంగం

- ఆకట్టుకోని చంద్రబాబు మాటలు
- జనం రాకపోవడంతో 30 నిమిషాల పాటు టెంట్‌లోనే నిరీక్షణ
- బాబు మాట్లాడుతుండగానే వెనుదిరిగిన ప్రజలు



చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో వెనుదిరిగి వెళుతున్న మహిళలు

కె.కోటపాడు: ఊకదంపుడు ఉపన్యాసాలు.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై విమర్శలు.. లేనిపోని గొప్పలతో సాగిన చంద్రబాబు మాటలు జనాన్ని ఆకట్టుకోలేకపోయాయి. ఆయన గొంతు చించుకుంటుంటే ప్రజల నుంచి స్పందన శూన్యం. అసలే అరకొరగా వచ్చిన జనం మాట్లాడుతుండగానే జారు కోవడంతో స్థానిక టీడీపీ నేతలు ఉసూరుమన్నారు. గొండుపాలెంలో నిర్వహించిన 'రా..కదిలి రా' సభలో చంద్రబాబు ప్రసంగం కార్యకర్తలకు, ప్రజలకు విసుగు తెప్పించింది. ఎప్పటిలాగానే మూస ప్రసంగానికే పరిమితమయ్యారే తప్ప పేద ప్రజలకు ఏమి చేస్తారో చెప్పలేదు. అనుకున్న సమయం కన్నా గంటసేపు ఆలస్యంగా చంద్రబాబు ప్రసంగం ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారమే హెలికాప్టర్‌లో సభాప్రాంగణానికి చేరుకున్న చంద్రబాబు జనం రాకపోవడంతో టెంట్‌లోనే అర్ధ గంట గడిపారు. దీంతో టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి, చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజులు ఆటోల్లో ఉన్న జనాన్ని సభా ప్రాంగణానికి వెళ్లాలని పదే పదే కోరాల్సి వచ్చింది. మండుటెండలో టీడీపీ నేతల ఒత్తిడి తట్టుకోలేక కొందరు బలవంతంగా సభలో కూర్చున్నారు. సభ ముగిసిన తరువాత సామాన్య ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. టీడీపీ కార్యకర్తలు గంట పాటు ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలపడంతో అత్యవసర ప్రయాణాలు చేసే వారు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అయ్యన్నా.. పిచ్చి ప్రేలాపన మానుకో

- ఎమ్మెల్యే గణేష్ ఫైర్



నర్సీపట్నం: టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడు పిచ్చి ప్రేలాపన మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హెచ్చరించారు. మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాడుగుల సభలో చంద్రబాబు మెప్పు కోసం అయ్యన్నపాత్రుడు వైఎస్సార్‌సీపీ నాయకులపై చౌకబారు విమర్శలు చేశారన్నారు. నిత్యం బూతులు మాట్లాడే అయ్యన్నపాత్రుడు తమ నాయకులను విమర్శిస్తే సిగ్గేస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వేల కోట్లు సంపాదించి, అధికారం పోయే సరికి తాగుబోతు అయ్యన్నపాత్రుడు మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు తన కొడుక్కి ఎంపీ టిక్కెట్ ఇవ్వండని అడుక్కునే దౌర్భాగ్య స్థితిలో ఉన్నాడన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన దొంగలు చంద్రబాబు, అయ్యన్నపాత్రుడేనని విరుచుకుపడ్డారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు 60 హామీలను కూడా నెరవేర్చలేదని, మీరా మా నాయకులను విమర్శించేది అని నిలదీశారు. నూటికి నూరుశాతం హామీలను నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి

మహారాణిపేట: తహసీల్దార్ సనపల రమణయ్యను హత్య చేసిన నిందితుడ్ని త్వరితగతిన పోలీసులు అరెస్టు చేయడంపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (అమరావతి ఏపీజేఏసీ) జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఆరు నెలల్లోపు నిందితుడ్ని కఠినంగా శిక్ష విధించాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథ్ కోరారు. హత్య జరిగిన వెంటనే నగర పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్ అప్రమత్తమై నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి, అరెస్టు చేయడంపై అభినందలు తెలిపారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.లక్షా 98 వేలు మాయం

- డ్రాలో బంగారం వలికిందంటూ మాయమాటలు
- అత్యాశకు పోయి లబోదిబోమంటున్న బాధితురాలు

మునగపాక: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా అమాయకులు మోసపోతూనే ఉన్నారు. ఫ్లిప్‌కార్ట్ కంపెనీ డ్రాలో బంగారం గెలుచుకున్నట్టు చెప్పడంతో ఓ మహిళ ఆకర్షితురాలై సుమారు రెండు లక్షల రూపాయలు పోగొట్టుకుంది. మండలంలోని ఉమ్మలాడకు చెందిన కాండ్రేగుల వరలక్ష్మికి గత నెల 20వ తేదీన ఫ్లిప్‌కార్ట్ కంపెనీ పేరిట ఒక నంబరు నుంచి ఫోన్ వచ్చింది. మీకు డ్రాలో రెండు తులాల బంగారం పలికిందని, ఇందుకు రూ.83 వేలు ఫోన్‌పే చేయాలని చెప్పారు. దీంతో ఆమె తన మొబైల్ నుంచి రూ.83 వేలను ఫోన్‌పే ద్వారా పంపింది. మూడు రోజుల తరువాత కొంత డబ్బులు అవసరమై బ్యాంక్‌కు వెళ్లి నగదు తీసుకునేందుకు ప్రయత్నించగా.. అప్పటికే తన అకౌంట్ నుంచి రూ.లక్షా 15 వేల నగదు డ్రా అయినట్లు గుర్తించింది. దీంతో తనకు వచ్చిన ఫోన్ నెంబరుకు ఆమె కాల్ చేసి తన అకౌంట్ నుంచి నగదు డ్రా అయిందని చెప్పింది. బంగారం కావాలంటే మరో రూ.50 వేలు ఇదే నెంబరుకు ఫోన్ పే చేయాలని చెప్పడంతో మోసానికి గురైనట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది.

వేదల చదువులకు ప్రభుత్వం తోడ్పాటు 8లో

పెళ్లికెందుకు తొందర.. చదువు చెప్పించండి ముందర..



బాల్యవివాహాల నిషేధం, 'బేటి పడావో బేటి బచావో' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- బాలికలకు 18 ఏళ్లు నిండాకే వివాహం చేయాలి
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: బాలికలను బాలురతో సమానంగా చదివించి వారికి 18 ఏళ్ల వయస్సు నిండాక మాత్రమే పెళ్లి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన 'బాల్యవివాహాల నిషేధం', 'బేటీ పడావో బేటీ బచావో' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు, విద్యాభివృద్ధికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ విషయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆడపిల్లల విషయంలో సమాజం దృక్పథాన్ని మార్చే విధంగా పోస్టర్ల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు నిర్వహించిన వారికి, వారిని ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ విషయమై జిల్లాలోని అన్ని పాఠశాలలు, కేజీబీవీలలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్, డ్వామా పీడీ ఇ.సందీప్, డీఆర్డీఏ పీడీ శచీదేవి పాల్గొన్నారు.

మురిసిన పల్లెలు

8లో



ప్రగతి పల్లె బాట పట్టింది.. గ్రామీణం మురిసిపోయింది.. ఇన్నాళ్లూ నిర్లక్ష్యానికి గురైన ఊరు ఇప్పుడెంతో మారిపోవడంతో ప్రజల్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. చీడికాడ మండలంలోని తురువోలు, జైతవరం గ్రామాల్లో రూ.8 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండి తోలుతూ ఆయన జనాన్ని హుషారెక్కించారు.

అల్లూరి ఆశయ సాధన కోసం..



అల్లూరి, గంటందొర సమాధులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గొలుగొండ: నేటి తరం విద్యార్థులు అల్లూరి ఆశయ సాధన పనిచేయాలని తూర్పుగోదావరి జిల్లా డి.పోలవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ అన్నారు. డి.పోలవరం పాఠశాల విద్యార్థులతో కలిసి ఆమె తన సొంత ఖర్చులతో కృష్ణదేవిపేటలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి బ్రిటిష్ వారితో చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు.

క్లుప్తంగా

ఘంటసాల రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

యలమంచిలి: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు 50వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక ఘంటసాల కళామందిర్‌లో ఈ నెల 11న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించ నున్నట్లు యలమంచిలి ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. పాల్గొనే గాయనీ గాయకులు ఘంటసాల సంగీత సారథ్యం వహించిన గీతాలను మాత్రమే ఆలపించాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. పాల్గొన్న ప్రతి సింగర్‌కు ప్రోత్సాహక బహుమతి ప్రదానం చేస్తామన్నారు. అదే రోజు సాయంత్రం ఘంటసాల కల్చరల్ ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత సినీ విభావరి నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9390877174 ఇడమూరి సాంబశివరావు, ముత్తుర్తి రామారావు 9866307171లను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి విశాఖలో దేవులపల్లి అమర్ పర్యటన

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారుడు దేవులపల్లి అమర్ మంగళవారం నుంచి విశాఖ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. మంగళవారం నుంచి 8వ తేదీ వరకు సాగే పర్యటనలో భాగంగా ఆయన జిల్లాలోని పలువురు అధికారులను, ప్రజాప్రతినిధులను కలుసుకుంటారు. వివిధ అధికారిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంటారు. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ చేరుకొని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. బుధవారం 10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో దేవులపల్లి అమర్ రచించిన 'మూడు దారులు' పుస్తకపరిచయ సభ నిర్వహించనున్నారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా, సీనియర్ జర్నలిస్టు వీవీ రమణమూర్తి పుస్తక సమీక్ష చేయ నున్నారు.

తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.10గంటలకు బయల్దేరవలసిన విశాఖ–తిరుపతి (08583) స్పెషల్ 3 గంటలు ఆలస్యంగా రాత్రి 10 గంటలకు బయల్దేరింది. పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ పరిస్థితి వచ్చింది.

మురిసిన పల్లెలు


తురువోలులో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి


ఎస్సీ కాలనీలో నూతన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

- తురువోలు, జైతవరంలో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- ప్రారంభోత్సవాలు చేసిన డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో ఆ రెండు పల్లెల్లో మరొక మారు సంక్రాంతి పండగ వచ్చినట్లయింది. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు అభివృద్ధికి నోచుకోని మండలంలోని తురువోలు, జైతవరం గ్రామాల్లో రూ.8 కోట్లతో పూర్తయిన పలు పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం ప్రారంభించారు. తొలుత గ్రామ పోలిమేరల నుంచి తురువోలు గ్రామస్తులు పూలబాటలు వేసి, మహిళలు, చిన్నారుల కోలాటాల నడుమ ఎద్దుల బండిపై ఆయన్ను ఊరేగింపుగా తీసుకొచ్చారు. విద్యార్థులు సీఎం జగన్, డిప్యూటీ సీఎం మాస్కులు ధరించి మండబయలు వద్ద దివంగత వైఎస్సార్ విగ్రహం వరకు ఘన స్వాగతం పలికారు. అక్కడ వైఎస్ విగ్రహానికి


ప్రారంభించిన జైతవరం సచివాలయ భవనం

పూలమాల వేశారు. తురువోలులో రూ.6 కోట్లు, జైతవరంలో రూ.2 కోట్లతో చేపట్టిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలు, రెండు తారు రోడ్లు, కమ్యూనిటీ హాల్, సీసీరోడ్లు, ఇంటింటి కుళాయిలు, అంగన్‌వాడీ భవనం, జెడ్పీ ఉన్నత, ఎంపీపీ పాఠశాలలో నాడు–నేడు అభివృద్ధి పనులు, ఉన్నత పాఠశాల నూతన కాంపౌండు వాల్ శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎస్సీ కాలనీ వద్ద డాక్టరు బీఆర్ అంబేడ్కర్, ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ, అల్లూరి సీతారామరాజు, అబ్దుల్ కలాం, బి.ఆర్.అంబేడ్కర్, గిడుగు వెంకటరామమూర్తి, స్వామి వివేకానంద, గౌతమ్ బుద్ధుడు, పొట్టి శ్రీరాములు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, మదర్ థెరిసా విగ్రహాలను ఆవిష్కరించారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ.1.65 కోట్లతో తురువోలు నుంచి జూరెడ్డివాని చెరువు వరకు కొండవీధి రోడ్డుకు అనుసంధానంగా 1.7 కిలోమీటర్ల మేర సీసీ, తారురోడ్డును, రూ.1.33 కోట్లతో తురువోలు నుంచి చొక్కాకుల వారి కళ్లాల మీదుగా మూడు కిలో మీటర్ల మేర తంగుడుబిల్లి వరకు నిర్మించిన తారురోడ్డును ప్రారంభించారు. నవరత్నాల వల్ల కలిగిన ప్రయోజనాలపై విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ మేరకు రైతు మిత్రా గ్రూపునకు అందించిన ట్రాక్టర్‌ను నడిపి ప్రారంభించారు. కుళాయి పాయింట్ ద్వారా నీటిని విడుదల చేసి గ్రామస్తులకు అంకితం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్ మట్టా అప్పారావు, కోడూరి సత్యవతి, ఉప సర్పంచ్‌లు పి.టి.బాబు, ఈర్లె చైతన్య, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, స్థానిక నేతలు చొక్కాకుల కోటి, లాలం శివకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఉద్యోగం, సాగు భూమి ఇస్తామని ఆర్డీవో జయరాం ప్రకటన
- రూ.2 లక్షల తక్షణ సాయం అందజేత

నర్సీపట్నం: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన హాస్టల్ విద్యార్థి దావీద్‌రాజు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఆర్డీవో హెచ్.వి.జయరాం భరోసా ఇచ్చారు. సోమవారం రెండో రోజు గిరిజన, ప్రజా సంఘాలు స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించాయి. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని ఆందోళనకారులు, బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో ఏరియా అక్కడకు విచ్చేసి వారితో మాట్లాడారు. విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్ మద్దు అప్పారావును సస్పెండ్ చేయడంతోపాటు బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఆయన్ను కోరారు. వెంటనే తక్షణ సాయంగా రూ.2 లక్షలు, గొలుగొండ మండలం బుడ్డడపాడుకు సమీపంలో సాగు భూమిని ఇస్తామని ప్రకటించారు. బాధిత కుటుంబంలో వారికి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగావకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, నర్సీపట్నం టౌన్ సీఐ కాంతికుమార్, ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో బాధిత కుటుంబానికి ఎంపీపీతో నగదు అందజేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపించి ఆదుకుంటామన్నారు. దీంతో గిరిజన, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన విరమించారు. అనంతరం విద్యార్థి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.


బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న ఎంపీపీ మణికుమారి, ఆర్డీవో జయరాం

హాస్టల్‌ను పరిశీలించిన విద్యుత్ శాఖ అధికారులు

గొలుగొండ: జోగుంపేట ఎస్సీ వసతి గృహం వద్ద విద్యార్థి దావీద్‌రాజ్ మృతి చెందిన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నర్సీపట్నం ఏడీఈ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ వసతి గృహాన్ని పరిశీలించారు. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యుత్ తీగల నుంచి శ్లాబ్‌కున్న ఇనుపరాడ్లకు సరఫరా అవుతుందని గుర్తించారు. దీని వల్ల వసతిగృహం అంతా సరఫరా అయినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. తాగునీటి ట్యాంక్ మేడపైన ఉండటం, విద్యార్థి దావీద్‌రాజు బట్టలు ఆరబెట్టడం కోసం అక్కడికి వెళ్లి షాక్‌కు గురైనట్లు నిర్ధారించారు. దీనిపై జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.


జోగుంపేట వసతిగృహం వద్ద సరఫరాను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

యలమంచిలి రూరల్: రేగుపాలెం – యలమంచిలి రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ వివరాల ప్రకారం.. రేగుపాలెం రైల్వే వంతెనకు సమీపంలో అప్‌లైన్ ట్రాక్ పక్కన 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని రైల్వే ట్రాక్‌మన్ చూసి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు అక్కడ పరిసరాలను పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి దుర్వాసన రావడం, గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో మూడు రోజుల క్రితమే చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి శరీరంపై స్కై బ్లూ రంగు టీషర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నాయి. చిరునామా గానీ, ఇతర ఆధారాలు గానీ లభించలేదు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ప్రాంతీయ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

తిరస్కరించిన అర్జీలకు సమాధానం చెప్పాలి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

- కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి
- 'జగనన్నకు చెబుదాం'కు 380 అర్జీలు

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులలో తిరస్కరించిన వాటికి కారణాలపై అర్జీదారులకు స్పష్టత ఇవ్వాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవానం జరిగిన జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన దరఖాస్తుల పరిష్కారం వేగంగా చేయాలన్నారు. ప్రజలు పలు సంక్షేమ పథకాల లబ్ధి కోసం చేసే వినతులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు వాటిని అందించేలా కృషి చేయాలన్నారు. తిరస్కరణ చేస్తున్న ఫిర్యాదులు, వినతులపై అర్జీదారులకు స్పష్టత ఇవ్వడం ద్వారా పునరావృతం అయ్యేందుకు ఉండదన్నారు. గ్రామస్థాయిలో సమస్యలపై మండల స్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు.

అధిక సంఖ్యలో వస్తున్న ఇళ్ల పట్టాల పథకంలో అర్హులకు 90 రోజుల్లో స్థలాలు కేటాయించాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని అర్హులకు వర్తింపజేయాలన్నారు. రెవెన్యూ అధికారులు భూ సంబంధిత అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, డీఆర్వో బి. దయానిధి, డీఆర్డీఏ పీడీ శచీదేవి అర్జీలను స్వీకరించారు. మొత్తం 380 అర్జీలు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ఎస్పీ స్పందనకు 34 అర్జీలు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 34 అర్జీలు వచ్చాయి. చట్ట పరిధిలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దిగువ స్థాయి అధికారులకు ఎస్పీ కె.వీ.మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

గ్రూపు -4లో జూనియర్ అసిస్టెంట్ జాబ్ ఇప్పిస్తామని మోసగించిన రోలుగుంట మండలం బెన్న భూపాలు గ్రామానికి చెందిన గొందు అప్పారావు(సిద్ధు)పై యలమంచిలి మండలం దార్లపూడికి చెందిన నామాల శ్యామ్యూల్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తన వద్ద మూడేళ్ల క్రితం దశలవారీగా రూ.5.30 లక్షలు తీసుకుని ఉద్యోగం ఇప్పించకపోవడంతో స్థానిక పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా, ఆరు మాసాల క్రితం రూ. 2,50 లక్షలు ఇచ్చాడని, మిగిలిన రూ.2.80 లక్షలు నేటికీ ఇవ్వకపోడంతో స్పందనలో ఫిర్యాదు చేశానని ఈ సందర్భంగా బాధితుడు తెలిపాడు.

కొక్కిరాపల్లి గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

యలమంచిలి: మున్సిపాలిటీ కొక్కిరాపల్లి వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల (ఆంగ్ల మాధ్యమం) 2024–25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా౹ ఇఖఃబ్రజ ఛ్ఫి౹ ఇఛిఛిజటట.జీ ౩ ఆన్‌లైన్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు 2011 సెప్టెంబరు ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, బీసీ, ఓసీలు 2013 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి చదివి ఉండాలన్నారు. వార్షిక ఆదాయం ఏడాదికి రూ.లక్షకు మించరాదన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 10న ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8328409747, 9441075715 సంప్రదించాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలకు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్ల మించి ఉండరాదన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసి ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ. లక్షకు మించి ఉండరాదన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న మధ్యాహ్నం ఉంటుందన్నారు. వివరాలకు 9490671262 సంప్రదించాలన్నారు.

మంచు కురిసే వేళలో..


మంచు కమ్ముకున్న రోడ్డుపై లైట్లు వేసుకొని చోడవరం పట్టణంలోకి వస్తున్న వాహనాలు

చోడవరం: పాడేరు ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న చోడవరం పరిసర ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున మంచువర్షం కురిసింది. పూర్తిగా పొగమంచు కమ్మేయడంతోపాటు వర్షపు జల్లుల్లా మంచు కురిసింది. ఈ సమయంలో మన్యం ప్రాంతాన్ని తలపించే ఎన్నో ప్రకృతి అందాలు మైదాన ప్రాంత ప్రజలను కూడా కనువిందు చేశాయి. గడిచిన మూడేళ్లలో ఎప్పుడూ లేనంత పొగమంచు కురుస్తూ చలి వణికించింది. తెల్లవారుజామున కమ్ముకుంటున్న మంచుతెరలు ఎన్నో ప్రకృతి అందాలను ఆవిష్కరించాయి. చోడవరం పట్టణంతోపాటు పరిసర ప్రాంతం ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించింది. రాత్రి ఉష్ణోగ్రతలు 16 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోగా ఉదయం 9 గంటలైనా ఉష్ణోగ్రతలు పెద్దగా పెరగలేదు. పొగమంచుతో పొలాలు, గ్రామాలన్నీ కమ్ముకోవడంతో ఊళ్లే కనిపించలేని పరిస్థితి నెలకొంది. మంచు కురిసి చలి వణికించడంతో జనం ఉన్ని దుస్తులు, చలిమంటలను ఆశ్రయించారు.

పేదల చదువులకు ప్రభుత్వం తోడ్పాటు



చర్చాగోష్టిలో పాల్గొన్న విద్యావేత్తలు

- సంక్షేమ పథకాల అమలు భేష్
- విద్యా వ్యవస్థపై దుష్ప్రచారం సరైంది కాదు
- విశాఖ నగరంలో నాన్ పొలిటికల్ జేఏసీ చర్చాగోష్టి
- పాల్గొన్న విద్యారంగ మేధావులు, అధ్యాపకులు, విద్యార్థులు

విశాఖ విద్య: భవిష్యత్ తరాల బాగు కోసమని విద్యరంగానికి అత్యంత పాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై కొన్ని రాజకీయ పార్టీలు, పత్రికలు చేస్తున్న దుష్ప్రచారాన్ని పలువురు విద్యావేత్తలు తీవ్రంగా తప్పుపట్టారు. ప్రభుత్వ బడులు నిర్వీర్యం చేయాలనే వారి కుట్రలు, పేద విద్యార్థులను చదువులకు దూరం చేయడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. విశాఖలోని ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో 'ప్రగతి బాటలో రాష్ట్ర విద్యా వ్యవస్థ' అనే అంశంపై సోమవారం చర్చా గోష్టి నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల మాజీ వైస్‌చాన్సలర్లు, ఆంధ్ర యూనివర్సిటీ వివిధ విభాగాల విశ్రాంత అధిపతులు, వర్సిటీలో కీలక విభాగాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యావేత్తలు, మేధావులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై కొంతమంది మేధావులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను వారి మాటల్లోనే...

జగన్ విజన్ ఉన్న నాయకుడు



గొప్ప విజన్ ఉన్న సీఎం జగన్. పాఠశాలల్లో డిజిటల్ బోధన, కంటెంట్ అందించడం చారిత్రాత్మకం. ఇంగ్లిషు మీడియం చదువులు పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నాయి. మధ్యాహ్న భోజనం ఫలితంగా డ్రాపవుట్స్ తగ్గాయి. క్వాలిటీ ఎడ్యుకేషన్ అందుబాటులో ఉంచారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి.

– ఆచార్య హెచ్. లజపతిరాయ్, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ

ప్రతీ విద్యార్థికి అవకాశాలు



నాణ్యమైన విద్యను అందించే విధంగా పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రపంచ స్థాయి సామర్థ్యాలను అందిపుచ్చుకునే విధంగా అందరికీ వనరులు, అవకాశాలను, నాణ్యమైన విద్య వ్యవస్థలను అందుబాటులో ఉంచారు. బడుల్లో ఐఎఫ్‌పీ ఫానెల్స్‌తో ప్రపంచం తరగతిలో ఆవిష్కృతమవుతోంది.

– ఆచార్య ఎం.జగన్నాథరావు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ

మానవ వనరుల అభివృద్ధి



దేశ అభివృద్ధికి మానవ వనరులు ఎంతో కీలకం. అభివృద్ధి చెందిన దేశాలను స్ఫూర్తిగా తీసుకొని, అదే తరహాలో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన రెడ్డి పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి దృక్పథం, పనితీరు మానవ వనరుల అభివృద్ధికి దోహదపడతాయి. నైపుణ్య చదువులతో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కల్పించేందుకు కార్పొరేట్ సంస్థలు కాలేజీలకు వస్తున్నాయి.

–ఆచార్య కె.శ్రీరామ మూర్తి, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్

అణగారిన వర్గాలు మళ్లీ బడిబాట



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేస్తున్న సంస్కరణలు ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అణగారిన వర్గాల పిల్లలు పాఠశాల బాట పడుతున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా విద్యను ఆస్తిగా ప్రతీ కుటుంబానికి అందించే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారు. నిజాలు తెలుసుకోకుండా కొంతమంది అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదు.

–ఆచార్య టి.షారోన్ రాజు, ఏయూ విద్యా విభాగాధిపతి

క్లుప్తంగా

జెడ్సీ బాధ్యతల స్వీకారం



జెడ్సీ అయ్యప్పనాయుడును అమ్మవారి చిత్రపటంతో సత్కరిస్తున్న మురళీకృష్ణ

అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా వి.అయ్యప్పనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీ నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్.వెంకటరమణను సాలూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. అంతకుముందు నూతన బాధ్యతలు చేపట్టిన అప్పయ్యనాయుడుకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నూకాంబికను దర్శించుకున్న జెడ్సీ..

జెడ్సీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అయ్యప్పనాయుడు గవరపాలెం నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ జెడ్సీకి ఘనస్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ మండపంలో అమ్మవారి చిత్రపటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు, జీవీఎంసీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



అనకాపల్లి : అనకాపల్లి తహసీల్దార్‌గా కోరాడ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం టౌన్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బదిలీపై ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న గంగాధరరావు అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా బదిలీపై వెళ్లారు.

పాఠశాలల విలీన ప్రక్రియ వద్దు

అనకాపల్లి : పాఠశాలల విలీన ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ)జిల్లా అధ్యక్షుడు ఆచంట రవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 117 జీవోతో పాఠశాలల విలీనంతో ప్రాథమిక పాఠశాలల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని, దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో పోస్టులు గణనీయంగా తగ్గిపోయాయని పేర్కొన్నారు. ఈ కారణంగా 703 మంది ఎస్‌జీటీలను ఏజెన్సీకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సమస్య ఏర్పడిందని, జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 12,303 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,640	4,650
మొదటి రకం	3,560	4,030
రెండో రకం	3,540	3,740
మూడోరకం	3,150	3,530

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
అంబాజీపేట మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణ స్క్రీన్-1
బూట్‌కట్ బాలరాజు	: సత్యనారాయణ స్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
ధీర	: పర్తిసాయి
కిస్మత్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 63 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం


అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 221 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 327 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



- 16న నాలుగో విడత పంపిణీ చర్యలు
- నియోజకవర్గంలో రూ.34 కోట్ల లబ్ధి
- 18 వేల మంది బీసీ, ఎస్సీ మహిళలకు ప్రయోజనం

మహిళల స్వయం ఉపాధికి 'చేయూత'





దిబ్బపాలెం గ్రామానికి చెందిన మళ్ల గిరిజాభవానీ ప్రభుత్వ తోడ్పాటుతో స్వయం ఉపాధి పొందుతున్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత ఆమెకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.50 వేలు, స్త్రీనిధి పథకంలో రూ.50 వేలు వ్యాపారాభివృద్ధి కోసం మంజూరైంది. దీంతో ఫ్యాన్సీ వస్తువుల విక్రయం ప్రారంభించారు. జగనన్న తోడు, వైఎస్సార్ చేయూతతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం డీఆర్డీఏ ద్వారా అజియో బ్రాండెడ్ దుస్తులను అందిస్తోంది. చీరలు, పంచెలు, బట్టలు అన్ని వస్తువులను ఆమె షాపులో విక్రయిస్తున్నారు. రోజుకు కనీసం రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వ్యాపారం సాగుతోందని, తమ పిల్లలకు విద్యాదీవెన కింద ప్రతి ఏటా రూ.35వేలు ఒకరికి, మరొకరికి రూ.40 వేలు ప్రభుత్వం అందిస్తోందని, దీంతో ఎటువంటి చింత లేకుండా మా కుటుంబం చాలా సంతోషంగా జీవిస్తున్నామని ఆమె ఆనందంగా చెబుతోంది.

తుమ్మపాల : నియోజకవర్గంలో ఇలా వేలాది మంది మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ‘చేయూత’ను అందిపుచ్చుకుని స్వయం ఉపాధిలో రాణిస్తున్నారు. కుటుంబ పోషణలో ఆర్థికంగా భాగస్వాములవుతున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఎన్నో పథకాలు అందుబాటులో ఉంచి అమలు చేస్తుంది. నవరత్నాలు–పేదలందరికీ సంక్షేమ అనే నినాదంతో రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను వరాలుగా అందిస్తుంది. వీటి వల్ల ప్రజల సామాజిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది. అసలైన అభివృద్ధి అంటే ఏమిటో చూపుతోంది. ఇందులో భాగంగా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా పేద కుటుంబాలకు చెందిన బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీల్లో అర్హత కలిగిన మహిళలకు ఏటా రూ.18750 అందిస్తుంది. వాటితో వృత్తి పనులు, వ్యాపార అభివృద్ధి చేసుకుంటూ మహిళలు ప్రయోజనం పొందుతున్నారు.

చేయూత వారోత్సవలు

అనకాపల్లి నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెంది, 45 ఏళ్లు దాటిన 18,419 మందికి నాలుగో విడత వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా ఈ నెల 16న ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి డీబీటీ పద్ధతి ద్వారా మహిళల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయనున్నారు. 16 నుంచి ప్రారంభించి నెలాఖరు వరకు చేయూత వారోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మహిళలకు చేయూత చెక్కులను పంపిణీ చేయనున్నారు.

నియోజకవర్గంలో లబ్ధిదారులు

మండలం	దరఖాస్తుదారులు	ఎంపికైనవారు	మొత్తం నగదు రూ.లలో
అనకాపల్లి	6,689	6,532	12,24,75,000
కశింకోట	6,111	6,006	11,26,12,500
అనకాపల్లి జీవీఎంసీ	5,776	5,633	10,56,18,500
మొత్తం	18,576	18,171	34,07,06,250

16న కలెక్టరేట్‌లో ప్రారంభం



వైఎస్సార్ చేయూత నాలుగో విడత నగదు పంపిణీ పథకం ఈ నెల 16న జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రారంభించిన తరువాత మండలాల వారీగా పంపిణీ కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలో పేదకుటుంబాలకు చెందిన దాదాపు 6500 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు చేయూత నగదు పంపిణీ జరుగుతుంది. నాలుగు విడతల్లో కలిపి ఒక్కొక్కరికి రూ74 వేలు ప్రభుత్వం అందించింది. వారికి చేయూతగా వృత్తి, వ్యాపార విస్తరణకు వివిధ పథకాలు ద్వారా రుణాలు అందిస్తున్నాం.

–కె.శ్రీనివాస్, ఏపీఎం. వెలుగు

ఏపీపీ సత్యనారాయణకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న న్యాయమూర్తి గంగరాజు, న్యాయవాదులు

అనకాపల్లి: స్థానిక న్యాయసముదాయంలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా సేవలందిస్తున్న బి.వి.సత్యనారాయణను జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ న్యాయమూర్తి జి.గంగరాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 26న కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఏపీపీగా సత్యనారాయణ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.వి.లక్ష్మణరావు(సాయి), ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

10న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 10న జరగనుంది. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి పొడవునా విద్యుద్దీపాలంకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్ ఆసరా రూ.13.92 కోట్లు





కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, వైఎస్సార్ ఆసరా చెక్కు నమూనా ప్రదర్శిస్తున్న మలసాల భరత్‌కుమార్, దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు

తుమ్మపాల : రానున్న ఐదేళ్లు మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డే కొనసాగేలా అందరూ ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో మార్టూరు గ్రామంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ ఆసరా వారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయనతో పాటు ఏపీ ఇన్‌ల్యాండ్స్ వాటర్ వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేశారు. వైఎస్సార్ ఆసరా ద్వారా మండలంలో 19,468 మంది మహిళలకు అందిస్తున్న రూ.13 కోట్ల 92 లక్షల, 62 వేల చెక్కు నమూనాను లబ్ధిదారులతో కలిపి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పక్షనాయకుడిగా గత ప్రభుత్వ మోసపూరిత హామీతో నష్టపోయిన మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా కొంత మొత్తం చెల్లిస్తూ ఈ ఏడాదితో ఆసరా ద్వారా పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకోవాలన్నారు. విద్యాదీవెన, విద్యాకానుక, అమ్మఒడి, గోరు ముద్ద వంటి పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికే అందిస్తున్న ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేదని గుర్తుచేశారు. ప్రతి గ్రామానికి రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, సచివాలయాలను ఏర్పాటు చేయడం, వాటి ద్వారా నిరంతరం సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న మోసపూరిత హామీలను, ప్రచారాలను నమ్మవద్దన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలో 19 వేలతో పాటు పట్టణంలో 11734 మంది మహిళలకు రూ.10.35 కోట్లు, కశింకోట మండలంలో 15,805 మందికి రూ13.27 మొత్తంగా నియోజకవర్గంలో 47 వేల మందికి వారి రుణ మొత్తాన్ని రూ.37 కోట్ల మేర చెల్లించడం జరిగిందన్నారు. మన జిల్లాలోనే రూ.273 కోట్లు అందించడం జరిగిందన్నారు. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టేలా మహిళలు ఆశీర్వదించాలన్నారు.

పిల్లల బంగారు భవిష్యత్తుకు అడుగులు వేసిన వ్యక్తి జగన్ అన్నారు. నాడు–నేడు ద్వారా సీఎం జగన్ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారని అన్నారు. ప్రతి బిడ్డకు పౌష్టికాహారం అందిస్తూ పిల్లల చదువుకు పూర్తి భరోసా తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఎంపీటీసీ మిద్దె రాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద, ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌కుమార్, డీఆర్డీఏ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'టిడ్కో' లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

అనకాపల్లి : అర్హులైన లబ్ధిదారులకు దశల వారిగా ప్రభుత్వ స్థలాలు, టిడ్కో గృహాలను అందజేయడం జరుగుతుందని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 83వ వార్డు పరిధిలో వేల్పులవీధి శ్రీ సీతారామ కల్యాణ మండపంలో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు అధ్యక్షతన 7, 8,9 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన టిడ్కో గృహాలను సోమవారం రాత్రి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 మందికి ఉచితంగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలను అందుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మద్దాల రమణబాబు, పార్టీ సీనియర్ నాయకులు బొండా శంకరరావు, వేల్పుల గణేష్, లట్టాల మురళి, దొడ్డి హేమంత్ పాల్గొన్నారు.



టిడ్కో గృహాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న మలసాల భరత్‌కుమార్

మహిళా సదస్సుకు ఏర్పాట్లు

కశింకోట : కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం మండల స్థాయిలో స్వయం సహాయక సంఘాల మహిళా సదస్సు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమం సందర్భంగా సభా వేదిక సిద్ధం చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

త్వరితగతిన అంతర్గత రోడ్ల నిర్మాణం

కశింకోట : కశింకోటలోని పలు ప్రాంతాల్లో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం పనులు త్వరితగతిన జరుగుతున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేసి వీటిని నిర్మిస్తున్నామని, ఇందుకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి అమర్‌నాథ్ ప్రత్యేక నిధులుగా వీటిని సమకూర్చారన్నారు.

వీటితో మంద బయల అంగన్‌వాడీ కేంద్రం వద్ద రోడ్డు, ద్వారపురెడ్డి వీధి, అమరపల్లి వీధి, హౌసింగ్ కాలనీ, నాలుగో సచివాలయ పరిధిలో రోడ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత హైస్కూల్లో సోమవారం భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిబేట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు పలు పాఠశాలల నుంచి 39 మంది విద్యార్థులు హాజరయ్యారని పరిషత్ అధ్యక్షుడు ఎ.ఓంరాం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు– ప్రజల హక్కులు, బాధ్యతలు అనే అంశంపై పోటీలు నిర్వహించామన్నారు. వాసవీ బాలవిహార్ స్కూల్ నుంచి కె.అక్షయ ప్రథమస్థానం దక్కించుకోగా, విద్యాధరి స్కూల్ నుంచి కె.అమూల్య ద్వితీయస్థానం, అదే స్కూల్‌కు చెందిన పి.అశ్విని తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యాధరి స్కూల్‌కు చెందిన బి.చైతన్యకుమార్, బాలికోన్నత స్కూల్‌కు చెందిన కె.లక్ష్మిలకు కన్సొలేషన్ బహుమతులు దక్కినట్లు తెలిపారు. అంతకుముందు విజేతలైన విద్యార్థులకు పరిషత్ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. కె.ఎల్.ఎన్.మూర్తి, కె.రమాదేవి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ కన్వీనర్ వై.కేశవరావు, కోకన్వీనర్ బి.వి.రాజు, సభ్యులు చదరం కోటేశ్వరరావు, ఎన్.ఎ.బి.వర్మ, కె.ఎల్.వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో పరిషత్ సభ్యులు

కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు


అనకాపల్లి : భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని స్థానిక న్యాయస్థానాల వద్ద 44వ రోజు సోమవారం న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ ఏపీ భూహక్కుల యాజమాన్య చట్టం 2022నకు వ్యతిరేకంగా దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుకోవాలని ఆయన కోరారు. దీక్షలో న్యాయవాదులు మళ్ల నూకరాజు, విజయ ఆనంద్, ఆర్.రమణ, ఆర్.శేఖర్, బి.లోవరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

కల్యాణికి ఏయూ డాక్టరేట్

యలమంచిలి రూరల్ : స్థిరమైన పట్టణ నీటి నిర్వహణ అంచనా, ఏకీకరణ భూతాపం ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసిన యలమంచిలికి చెందిన కుంచాల కళ్యాణికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సోమవారం డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. భూ వినియోగానికి సంబంధించి రాబోయే వాతావరణ మార్పులు, ఆర్ లాంగ్వేజి సహాయంతో వర్షపాతం, భూ ఉపరితల ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గుల గురించి లోతైన పరిశోధన చేశారు కల్యాణి. 2012లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, 2014లో ఎంటెక్ పూర్తి చేసిన కళ్యాణి సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎండీ మునిరెడ్డి పర్యవేక్షణలో విజయవంతంగా ఈ పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. కల్యాణి తండ్రి కె.వీరయ్య యలమంచిలి మున్సిపాలిటీలో డీఈఈగా పనిచేస్తున్నారు. కళ్యాణి డాక్టరేట్ డిగ్రీ పొందడం పట్ల మున్సిపల్ కమిషనర్ కొండలరావు, పలువురు అధికారులు, స్నేహితులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

'ఆయుష్మాన్' వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారిగా శిరీష

కశింకోట : కన్నూరుపాలెంలో ఉన్న ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారిగా టి.శిరీష నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఇన్‌ఛార్జిగా ఇప్పటి వరకు వ్యవహరించారు. కన్నూరుపాలెంలో ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా వ్యవహరించిన కె.లావణ్యను యథావిధిగా అనకాపల్లి ఆస్పత్రిలో నియమించారు.



కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారి టి.శిరీష

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అనకాపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్‌లో సోమవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వంటచేసే సమయంలో అగ్నిప్రమాదానికి గురైన కార్మికులకు నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు. కార్మికులకు రూ.10వేలు వేతనం అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్కర్లకు ఏడాదికి రెండు జతల యూనిఫాం, రెండు నెలలకొకసారి వర్కర్లతో ఎంఈవోలు సమావేశాలు జరిపి వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్లసంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, జిల్లా నాయకులు శ్రీదేవి, ఉమ, అమ్మాజీ, గౌరీ, పెద్దసంఖ్యలో వర్కర్లు పాల్గొన్నారు.

నేడు జువ్వాలమ్మ పండగ

మునగపాక : గంటవానిపాలెం గ్రామంలో మంగళవారం జువ్వాలమ్మ తల్లి పండగ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. పండగలో భాగంగా గ్రామంలో రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరారు.

హాస్టల్ విద్యార్థి మృతికి కారకులైన అధికారులపై చర్యలకు డిమాండ్

తుమ్మపాల : హాస్టల్ విద్యార్థి మృతికి కారకులైన విద్యుత్ శాఖ ఏఈ, నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూఓ శ్యామల, హాస్టల్ సంక్షేమ అధికారిపై చర్యలు చేపట్టాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, వివిధ దళిత సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి హాస్టల్లో పరిస్థితిపైన అధికారుల పర్యవేక్షణ లేదని, సక్రమ రీతిలో ఏఎస్‌డబ్ల్యూఓలు పనిచేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం ఎస్‌డబ్ల్యూవో శ్యామల పలుసార్లు గొలుగొండ మండలం జోగంపేట ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కి వెళ్లినప్పటికి అక్కడ ఉన్న పరిస్థితులను గమనించడంలోను, భద్రత శానిటేషన్‌పై దృష్టి సారించకపోవడం వల్లనే విద్యార్థి విద్యుత్ షాక్‌కి గురై మరణించాడన్నారు. వార్డెన్ అప్పారావు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌కు, నర్సీపట్నం ఎస్‌డబ్ల్యూ శ్యామలకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు స్పందించలేదన్నారు. వీరిద్దరి నిర్లక్ష్యమే ఏడో తరగతి విద్యార్థి తూబిరి దావీదు రాజు మృతికి కారణమైందని ఆరోపించారు. డీవీఎంసీ సభ్యుడు బొడ్డెడ అప్పారావు, ప్రభుత్వ రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు మల్లారపు లోవచందు, మోన రమేష్ పాల్గొన్నారు.

దశలవారీగా డంపింగ్‌యార్డు అభివృద్ధి

అనకాపల్లి : మండలంలో తుమ్మపాల డంపింగ్ యార్డును దశలు వారిగా అభివృద్ధి చేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. సోమవారం డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను పొక్లెయిన్‌తో సహాయంలో చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మపాల గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ వార్డుల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులో వేయడం జరుగుతుందన్నారు. చెత్తను రహదారులపైకి రాకుండా పొక్లెయిన్‌తో చదును చేయించడం జరిగిందన్నారు.



పొక్లెయిన్ సహాయంతో చెత్తను చదును చేయిస్తున్న పెంటయ్యనాయుడు

చురుగ్గా వెల్‌నెస్ సెంటర్ భవనం పనులు



కన్నూరుపాలెంలో నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్ భవనం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం (ఈ.చౌడువాడ) సచివాలయ పరిధిలో నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్ భవనం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సచివాలయాల ఏర్పాటుతో ఇక్కడ కూడా వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. దీనికి సుమారు రూ.25 లక్షలతో అక్కడి ఆయుర్వేదిక్ ఆస్పత్రి పక్కన స్థలంలో భవన నిర్మాణం చేపట్టి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. పనులు పూర్తయితే వెల్‌నెస్ సెంటర్‌కు అన్ని సౌకర్యాలతో సొంత భవనం సమకూరనుంది.